లక్ష్మీదేవిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వనమా వెంకటేశ్వరరావు, ఎడవల్లి కృష్ణ

## 'గూడెం'లో బీఆర్ఎస్‌దే గెలుపు

- సీఎం కేసీఆర్ పాలనలోనే ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి
- జలగం ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారు
- లక్ష్మీదేవిపల్లి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వనమా

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): కొత్తగూడెం నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కొత్తగూడెం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో గురువారం పర్యటించిన ఆయన.. రేగళ్ల, బంగారుచెలక, చింతకుంట, పునుకుడుచెలక, మైలారం గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి చూపూ బీఆర్ఎస్‌వైపే ఉన్నదని, అందుకే ఎక్కడికి వెళ్లినా జనం నీరాజనం పలుకుతున్నారని అన్నారు. హరిదాసులైనా ఏడాదికి ఒకసారి కన్పిస్తారు కానీ ఇక్కడ పోటీలో ఉన్న జలగం వెంకట్రావు మాత్రం ఈ ఐదేళ్లలో ఈ ప్రాంతంలో కన్పించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రకటించిన గ్యారెంటీ స్కీములన్నీ వారి జేబుల్లోకేనని అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు ఎడవల్లి కృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్, సీపీఐ, స్వతంత్ర అభ్యర్థులు ఎన్ని కుయుక్తులు పన్నినా బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు కొట్టి వెంకటేశ్వర్లు, కాసుల వెంకట్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఆదరించండి..

- బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఏజెన్సీ పల్లెలకు సీసీ రోడ్లు వచ్చాయి..
- దమ్మపేట ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట, నవంబర్ 16: రాష్ట్రంలోనూ, అశ్వారావుపేట నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని బీఆర్ఎస్ అశ్వారావుపేట నియోజకవర్గ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు కోరారు. అదే సమయంలో ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న తనను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వాల పాలనలో ఏజెన్సీల్లో పల్లెల్లో మట్టి రోడ్లే దర్శనమిచ్చేవని అన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అన్ని పల్లెల్లోనూ సీసీ రోడ్లు, బీటీ రోడ్లే మెరుస్తున్నాయని వివరించారు. అభివృద్ధిలో అన్ని గ్రామాలనూ తీర్చిదిద్దిన తనకు ఈ ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు అఖండ మెజార్టీని అందించాలని కోరారు. దమ్మపేట మండలంలో గురువారం పర్యటించిన ఆయన.. ఆర్ల పెంట, లంకాలపల్లి, అంకంపాలెం, పాకలగూడెం, పార్కలగండి, సుధాపల్లి, కొడిశెలగూడెం, చెన్నువారిగూడెం, పట్వారిగూడెం, బాలరాజుగూడెం, గండుగులపల్లి, దురదపాడు, రెడ్యాల పాడు, తొట్టిపంపు గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో రూ.కోట్ల నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని అన్నారు. కోర్టు భవనంతో అన్ని మండలాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. సీఎం కేసీఆర్ ఆమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని అన్నారు. ప్రజలందరూ ఈ సంక్షేమాన్ని గమనించి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. అలాగే మిగిలిన వారికి కూడా త్వరలోనే పోడు పట్టాలు అందిస్తామని అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పల వెంకటరమణ, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు రావు జోగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, సున్నం నాగమణి, వగ్గెల పూజ, భూక్యా ప్రసాద్, సోయం వీరభద్రం, బానోతు పద్మావతి, బండారు సూర్యనారాయణ, పైడి వెంకటేశ్వరరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, దొడ్డా రమేశ్, దారా యుగంధర్, యార్లగడ్డ శ్రీను, పైడి సాయికుమార్, రాయల నాగేశ్వరరావు, బొల్లికొండ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పట్వారిగూడెంలో పండ్ల వ్యాపారిని ఓటు అడుగుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా

# కేసీఆర్‌తోనే ముస్లింలకు మేలు

- తెలంగాణ వచ్చాక మైనార్టీల అభివృద్ధికి రూ.10,600 కోట్ల నిధులు
- ఉమ్మడి జిల్లాలోని పది చోట్లా మైనార్టీలు బీఆర్ఎస్‌ను గెలిపించాలి
- ఆర్ఎస్ఎస్ భావజాలమున్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి బుద్ధిచెప్పాలి
- ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో చెప్పకోలేని దుస్థితి కాంగ్రెస్ పార్టీది..
- విలేకరుల సమావేశంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ

ఖమ్మం, నవంబర్ 16: కేసీఆర్ ప్రభుత్వంలోనే మైనార్టీలకు అనేక ప్రయోజనాలు చేకూరాయని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఎంతో మేలు కలిగిందని అన్నారు. తెలంగాణ వచ్చాక మైనార్టీల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.10,600 కోట్లు వెచ్చించిందని వివరించారు. మైనార్టీలను అన్ని విధాలా ఆదుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి మైనార్టీ ప్రజలు కూడా అండగా ఉండాలని, ఉమ్మడి జిల్లాలోని పది స్థానాల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలో గురువారం పర్యటించిన ఆయన.. బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ గెలుపును కాంక్షిస్తూ నగరంలో రోడ్‌షో నిర్వహించారు. తొలుత బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పూర్తి ఆర్ఎస్ఎస్ భావజాలమున్న పీసీసీ చీఫ్ రేవంత్‌కు తెలంగాణ ప్రజలు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. తమ పార్టీ సీఎం అభ్యర్థి కేసీఆరేనని స్పష్టం చేశారు. కానీ ఇప్పటికీ ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో చెప్పలేని దుస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉందని విమర్శించారు. కాంగ్రెస్‌లో 20 మంది సీఎం అభ్యర్థులున్నారంటూ ఆ పార్టీ నేతలే చెప్పుకుంటుండడం సిగ్గుచేటని అన్నారు. కేసీఆర్ తెలంగాణ జాతిపిత అనే భావనతోనే తాను కరీంనగర్‌లో మాట్లాడాను తప్ప ముస్లిం మైనార్టీలను తప్పుపట్టలేదని అన్నారు. తన వ్యాఖ్యలను మీడియా వక్రీకరించిందని అన్నారు. ఖమ్మం గతంలో ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో ఇక్కడి ప్రజలు ఆలోచించాలని కోరారు. అజయ్‌కుమార్ చాలా మంచి వారని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి ఆయనకు గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆర్ జేసీ కృష్ణ, కూరాకుల నాగభూషణం, పునుకొల్లు నీరజ, జహీర్ అలీ, ఖమర్, షౌకత్ అలీ, తాజుద్దీన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, చిత్రంలో మంత్రి అజయ్

## బీఆర్ఎస్‌తోనే మైనార్టీల అభ్యున్నతి: మహమూద్ అలీ

గత ప్రభుత్వాలు ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశాయని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ విమర్శించారు. కానీ వారి అభ్యున్నతికి తోడ్పడింది మాత్రం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ గెలుపును కాంక్షిస్తూ ఎంపీ నామా నాగేశ్వరరావుతో కలిసి ఖమ్మంలో గురువారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ముస్లిం మైనార్టీలు అధిక సంఖ్యలో ఉన్న ఖమ్మంలో పువ్వాడకు ఓటు వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే అన్నారు. ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయమన్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పునుకొల్లు నీరజ, కూరాకుల నాగభూషణం, జహీర్అలీ, మక్బుల్, షౌకత్ అలీ, ఖమర్, తాజుద్దీన్, షకీనా తదితరులు పాల్గొన్నారు.

రోడ్‌షోలో మాట్లాడుతున్న అజయ్, చిత్రంలో మహమూద్

# సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- రాష్ట్రంలో మళ్లీ వచ్చేది మన బీఆర్ఎస్ ప్రభుత్వమే
- కాంగ్రెస్ నాయకుల మాటలు అస్సలు నమ్మొద్దు
- కరకగూడెం ప్రచారంలో ప్రభుత్వ విప్ కాంతారావు

కరకగూడెం, నవంబర్ 16: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది మన బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తేల్చిచెప్పారు. కరకగూడెం మండలంలో గురువారం పర్యటించిన ఆయన.. చిరుమళ్ల పంచాయతీతోపాటు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా పోలకమ్మతోగు సమీపంలో రైతు కూలీలతో కలిసి విప్ రేగా వరికోత కోశారు. గడిచిన పదేళ్లలో చేసిన అభివృద్ధి గురించి, మళ్లీ అధికారంలోకి వస్తే అయనున్న అభివృద్ధి గురించి కూలీలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి మూడోసారి కూడా కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఏకమవుతున్న శక్తులకు ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకుల మాటలను అస్సలు నమ్మవద్దని సూచించారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు రేగా కాళిక, నర్సింహారావు, సోమయ్య, అక్కిరెడ్డి సంజీవరెడ్డి, రాము, చిరంజీవి, సతీష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతే..**

ఈ ఎన్నికల్లో ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కుటుంబాల వారు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో చేరికలతో ప్రతిపక్షాలు బెంబేలెత్తుతున్నాయన్నారు.

కరకగూడెంలో గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న విప్ రేగా

# మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆరెస్సే..

- నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలూ పనిచేస్తా
- చర్ల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు

చర్ల, నవంబర్ 16: అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపిన బీఆర్ఎస్ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందని బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు స్పష్టం చేశారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏజెన్సీలోని సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. చర్ల మండలంలో గురువారం పర్యటించిన ఆయన.. సుబ్బంపేట, పూసుగుప్ప, వద్దిపేట, ఉంజిపల్లి వెంకటచెర్వు, లెనిన్‌కాలనీ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం పలు పార్టీలకు చెందిన మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం చర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధికి దూరమైందని అన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలూ పనిచేస్తానని అన్నారు. బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు సోయం రాజారావు, పోలిన లంకరాజు, మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, గీద కోదండరామయ్య, కాపుల కృష్ణార్జునరావు, కొటేరు శ్రీనివాసరెడ్డి, సీతాపతిరాజు, తాతారావు, కాపుల నాగరాజు, దొడ్డి సూరిబాబు, అజీజ్, పోలిన రామచంద్రరావు, సోయం కృష్ణవేణి, పంజా రాజు పాల్గొన్నారు.

చర్లలో విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు